# వసంతానికి స్వాగతం




కొన్నాళ్ళ క్రితం వరకు ఆకులు రాలిపోయి, విలవిలలాడిన చెట్లు, మళ్ళీ చిగురుతొడిగి, పక్షులను ఆహ్వానిస్తూ, కళకళలాడుతూ నవ వసంతానికి ఆహ్వానము పలుకుతున్న ఈ తరుణంలో ఆనందతాండవం చేయని హృదయములు ఉంటాయా? వలసపోయిన పక్షులు తిరిగి రావడం, చలిని తట్టుకొనేందుకు ఇల్లలోనే వెచ్చగా కాలము వెళ్ళబుచ్చిన జనావళి మళ్ళీ బయట ప్రకృతి అందాలను ఆస్వాదిస్తుండడం, తెల్లని తివాచీ పరచినట్లున్న పరిసరాలు (మంచుపడే ప్రదేశములలో) మళ్ళీ పచ్చగా పచ్చిక మైదానములతో కన్నులకు ఇంపును కలిగించడం, మన(సు)కు ఆహ్లాదము కలిగించడం ఈ ఋతువులో విశేషము. ఈ సందర్భములో చక్కని గులాబీలతో వసంతాన్ని ఆస్వాదిద్దామా!

ఇకపోతే శ్రీరామనవమి చైత్ర శుద్ధ నవమిరోజు జరుపుకుంటాము. ఇదే రోజు భద్రాచలక్షేత్రములో సీతారామకల్యాణము జరపడం అనాదిగా వస్తున్న ఆచారం. 'రాముడు మంచి బాలుడు' అని చిన్నప్పుడు చదువుకున్నాం కదా! మంచితనము మనలోనూ మూర్తీభవిస్తే, మనము శ్రీరామచంద్రుని అంతవారము కాగలము. సకల గుణాభిరాముడు అన్నారు శ్రీరామచంద్రుని. కాని ఈ రోజులలో సకల గుణాభిరాముడు అంటే అన్ని దుర్గుణములు ఉన్న వ్యక్తిగా సమాజం ముద్రవేస్తున్నది. కాని గుణము అంటే మంచి లక్షణము అని, దోషము అంటే చెడు లక్షణము అని అర్థము. నిజానికి శ్రీరామచంద్రుడు గుణములకు అతీతుడు. మానవుడు ఎలా మనుగడ సాగించాలి అనే విషయమును శ్రీరాముడు అచరించి చూపించాడు. సీతారాములు ఆదర్శదాంపత్యానికి నిర్వచనమును ఆచరణద్వారా తెలియజేసారు. కష్టములలోను సుఖములలోను కూడా ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉండాలి. భార్య, భర్త మంచి స్నేహితులుగా, ఒకరి గురించి మరొకరికి పూర్తి అవగాహన ఉండేటట్లు, ఒకరి ఆలోచనలను మరొకరు గౌరవిస్తూ, ఒకరి హితమును వేరొకరు కోరుతూ, ప్రేమ పరిపూర్ణమైన జీవనం సాగిస్తే ఈ భూలోకమే స్వర్గము అవుతుంది.

పాఠకులకు విరోధినామ సంవత్సర శుభాకాంక్షలు - **సుశ్రీ.**